E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 30-07-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు పాత పెన్షన్‌కు అర్హులే: హైకోర్టు » 3లో

# యుద్ధం ఆపాలని నాకు ఎవరూ చెప్పలేదు

- అంతకు అంతా బదులిస్తామని.. బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం ఇస్తామని స్పష్టంగా చెప్పాను
- 'ఆపరేషన్ సిందూర్'తో మన సామర్థ్యం ఏమిటో ప్రపంచమంతటికీ తెలిసింది
- 22 నిమిషాల్లోనే ఉగ్రస్థావరాలు ధ్వంసం చేశాం
- సైనిక దళాలపై నమ్మకంతో స్వేచ్ఛ ఇచ్చాం
- 'చాలా దెబ్బతీశారు.. ఇక చాలు' అంటూ పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది
- పాక్ ఎయిర్‌బేసలు ఇంకా ఐసీయూలో ఉన్నాయి
- ప్రపంచమంతా భారత్‌కు మద్దతుగా నిలిచింది
- కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్‌కు రిమోట్‌గా మారింది
- వాళ్లు రాజకీయ లబ్ధి కోసం చేసిన ఆరోపణలు
- సైనిక దళాల ఆత్మస్థైర్యంపై ప్రభావం చూపాయి
- 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం



ఈకబురు, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అంశంలో పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆపాలని ఏ ప్రపంచ నేత కూడా భారత్‌ను అడగలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటు వేదికగా ప్రకటించారు. తానే భారత్, పాక్ యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తోసిపుచ్చేలా స్పష్టత ఇచ్చారు. మూడు దేశాలు తప్ప మొత్తం ప్రపంచ దేశాలన్నీ భారత్‌కే మద్దతు పలికాయని చెప్పారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం.. ఎంతో పరాక్రమం చూపిన మన సైనికులకు మద్దతుగా నిలవకుండా. పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చేలా సందేహాలు వ్యక్తం చేశాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానం చెప్పారు. సుమారు రెండు గంటల పాటు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పడంతోపాటు కాంగ్రెస్‌పై విమర్శల తూటాలు ఎక్కుపెట్టారు. చివరగా పాకిస్థాన్‌కూ హెచ్చరికలు జారీ చేశారు. బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం

తరువాయి 2లో

## ఆదర్శ హైదరాబాద్ లక్ష్యంగా పనిచేయాలి



- పాతికేళ్లకు సరిపడా ప్రణాళిక రూపొందించండి
- తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను ప్రక్షాళన చేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈ కబురు, హైదరాబాద్: రానున్న పాతికేళ్ల అవసరాలకు తగ్గట్టుగా హైదరాబాద్ నగరాన్ని అందంగా... ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం పచ్చదనం, తాగునీరు, మురుగునీరు, ప్రజా రవాణా వంటి ప్రతి అంశంలోనూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

తరువాయి 2లో


తెలుగు రాష్ట్రాల్లో నేడు గ్యాస్ సిలిండర్ ధరలు.. » 4లో




చివరి టెస్టులో బుమ్రా ఆడతాడా?.. ప్రస్తుతం ఫిట్‌గానే ఉన్నాడంటున్న కోచ్! » 6లో



డైరెక్టర్‌కు ట్రాన్స్ లేటర్‌గా నిత్యామీనన్.. స్టేజీపై నవ్వులే నవ్వులు! » 5లో



పన్ను చెల్లింపుదారులకు ఊరట.. వేగవంత మైన ఐటీఆర్ » 4లో





## గాజాలో మారణ హోమంపై మోదీ మౌనం సిగ్గుచేటు

» 2లో

## దిగువకు కృష్ణమ్మ పరవళ్లు



- తెరుచుకున్న సాగర్ గేట్లు, నీటి విడుదల
- స్విచ్ ఆన్ చేసిన మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్‌కుమార్
- జూలైలో గేట్లెత్తడం 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి
- రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తొలగిస్తాం: ఉత్తమ్

ఈ కబురు, నాగార్జునసాగర్/యాదాద్రి/హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు మొదలయ్యాయి. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడం, గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు

తరువాయి 3లో

## పాక్‌తో పోరాడే సంకల్పమే మీకు లేదు

» 2లో





## బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల దీక్ష

» 3లో

## భారత్‌పై ఎంత శాతం టారిఫ్ విధించవచ్చో హింట్ ఇచ్చిన ట్రంప్



ఈ కబురు ,వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ వాయిదా గడువు ఆగస్టు 1 లోపు ఒప్పందం కుదరకుంటే గరిష్ఠంగా 25 శాతం సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు

తరువాయి 3లో



## యుద్ధం ఎందుకు ఆపారో చెప్పరేం?

» 2లో

## బనకచర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందే



» రైతుల కోసం రాజీ లేని పోరాటాలను ఉద్ధృతం చేయాలి
» పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం
» భారాస అధినేతతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం...వ్యవసాయ సంక్షోభాన్ని నివారించేందుకు...రాజీ లేని పోరాటాలు మరింత ఉద్ధృతం చేయాలని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసేలా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిందంటూ.. దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం భారాస శ్రేణులను క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎర్రవల్లి నివాసంలో

తరువాయి 2లో



# సాగర్ నుంచి కృష్ణమ్మ ఉరకలు

» శ్రీశైలానికి 2,89,670 క్యూసెక్కుల వరద ప్రవాహం
» 203 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
» 8 క్రస్ట్ గేట్లను తెరిచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల
» సాగర్‌లో 305 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

ఈ కబురు, విజయపురి సౌత్, సత్రశాల (రెంటచింతల), నరసరావుపేట, శ్రీశైలం ప్రాజెక్ట్: నాగార్జున సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 305 టీఎంసీలకు చేరుకోవడంతో 26 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో జలాశయం నుంచి 2,04,048 క్యూసెక్కులు విడుదలవుతోంది. గేట్లతో పాటు విద్యుదుత్పాదనతో మరో 28,420 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. ఈ నీరంతా దిగువనున్న టెయిల్‌పాండ్ ద్వారా పులిచింతల ప్రాజెక్టులోకి చేరుతుంది.

తరువాయి 3లో

## సీఎం రేవంత్‌కు సుప్రీంకోర్టులో ఊరట

» 2లో



మొదటి పేజీ తరువాయి

# యుద్ధం ఆపాలని నాకు ఎవరూ చెప్పలేదు



ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో మాట్లాడారని ప్రధాని మోదీ వెల్లడించారు. ''మే 9న రాత్రి నాతో మాట్లాడేందుకు జేడీ వాన్స్ మూడు, నాలుగు సార్లు కాల్ చేశారు. సైనికాధికారులతో సమావేశాలతో బిజీగా ఉన్నాను. చివరికి కాల్ మాట్లాడాను. పాకిస్థాన్ భారీ దాడి చేయబోతోందని జేడీ వాన్స్ నన్ను హెచ్చరించారు. పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ అంతకు మించి బదులిస్తుందని.. వారు బుల్లెట్లు వాడితే మేం శతఘ్నులతో బదులిస్తామని ఆయనకు స్పష్టం చేశాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆపాలని ప్రపంచంలో ఏ దేశానికి చెందిన ఏ నేత కూడా భారత్‌ను అడగలేదు. ఐక్యరాజ్యసమితిలో కేవలం మూడు దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడాయి. మిగతా అన్ని ప్రపంచ దేశాల నుంచి భారత్‌కే మద్దతు లభించింది. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మన దేశ సైనికులకు మద్దతుగా నిలవలేదు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నేతలు నన్ను లక్ష్యంగా చేసుకుని గుప్పించిన అవివేకమైన ఆరోపణలు.. సైన్యం నైతిక విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి'' అని మోదీ మండిపడ్డారు.

**మన సామర్థ్యమేమిటో ప్రపంచానికి తెలిసింది**

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఆయుధాలు, రక్షణ వ్యవస్థల్లో డొల్లతనం ఏమిటో, భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన డ్రోన్లు, క్షిపణుల ప్రతాపం ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ప్రధాని మోదీ చెప్పారు. ''పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా కేవలం 22 నిమిషాల్లో పాకిస్థాన్ భూభాగంలో లోపలి ప్రాంతాల్లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. మరునాడు భారత్‌పై దాడికి పాల్పడితే.. పాకిస్థాన్‌పై క్షిపణుల వర్షం కురిపించాం. భారత్ దాడులతో పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌లు ఎంతగా దెబ్బతిన్నాయంటే.. ఇంకా ఐసీయూలోనే ఉన్నాయి. పాకిస్థాన్‌కు పరిస్థితి ఏమిటో అర్థమైపోయి.. అణ్వస్త్ర దాడులంటూ బెదిరింపులకు దిగింది. కానీ ఏ తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. ఆపరేషన్ సిందూర్ మొదలు సింధు నది (సింధు జలాల ఒప్పందం) వరకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పాకిస్థాన్‌కు తెలుసు. ఎలాంటి దాడి చేసినా మరింత భారీ స్థాయిలో ప్రతిదాడి ఉంటుందని అర్థమైంది. అందుకే ఏమీ చేయలేకుండా ఉండిపోయింది'' అని మోదీ చెప్పారు. 'చాలా దెబ్బతీశారు. ఇక చాలు (బహుత్ మారా. బస్ కరో)' అంటూ పాకిస్థాన్ డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్) కాళ్లబేరానికి వచ్చారని పేర్కొన్నారు. 'ఒకవేళ మీరు ఏమైనా చేయదలిస్తే.. ఫలితం చాలా దారుణంగా ఉంటుంది' అని హెచ్చరించామని తెలిపారు. దేశంలో ఇంతకుముందు ఉగ్రదాడులు జరిగాయని, ఏం చేసినా తమకేమీ కాదని వాటి సూత్రధారులు ధైర్యంగా ఉండేవారని.. కానీ ఇప్పుడు భారత్ వెంటాడుతుందని వారికి అర్థమైందని చెప్పారు.

**పాకిస్థాన్ ప్రతినిధుల్లా కాంగ్రెస్, మిత్రపక్షాలు**

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దురదృష్టవశాత్తూ పాకిస్థానీ తప్పుడు ప్రచారానికి ప్రతినిధులుగా మారిపోయాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. భారత్ అన్ని అంశాల్లో స్వయం సమృద్ధి సాధిస్తే.. కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్ మీదే ఆధారపడిందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడిపై పాకిస్థాన్ పాడిన పాటే కాంగ్రెస్ పాడుతుండటాన్ని, పాకిస్థాన్‌కు రిమోట్ కంట్రోల్‌లా మారిపోవడాన్ని చూసి దేశమంతా విస్తుపోయిందని వ్యాఖ్యానించారు. దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లుతున్న సమయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చూసీచూడనట్టు వదిలేసిందని.. ఉగ్రవాద నిరోధక చట్టాలను నిర్వీర్యం చేసిందని మోదీ ఆరోపించారు. గాంధీ కుటుంబం ఒత్తిడితో పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడవద్దని కాంగ్రెస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ ఎంపీలు శశిథరూర్, మనీశ్ తివారీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలకు ప్రజెంటేషన్ ఇవ్వడానికి వెళ్లిన బృందాల్లోని కొందరు నేతలు పార్లమెంటులో మాట్లాడకుండా కాంగ్రెస్ నిలువరించిందని విమర్శించారు.

**మీకు అద్దాన్ని చూపేందుకే ఇలా నిలబడ్డా..**

పహల్గాం ఘటన మన దేశంలో అల్లర్లు రేపేందుకు జరిగిన కుట్ర అని, దాన్ని మన దేశ ఐక్యత విఫలం చేసిందని మోదీ చెప్పారు. ఉగ్రవాదుల ప్రధాన స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, అందుకే ఈ పార్లమెంటు సమావేశాలను విజయోత్సవాలని చెబుతున్నానని తెలిపారు. ''నేను భారత్ తరఫున నిలబడి ఉన్నాను. దీన్ని అర్థం చేసుకోలేని వారికి వారి ముఖం చూసుకునేలా అద్దాన్ని చూపడానికి నిలబడ్డాను. ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్నవారికి ఊహించలేని రీతిలో బుద్ధిచెబుతామని నేను ముందే చెప్పాను. మన సైనికదళాల సామర్థ్యంపై పూర్తి నమ్మకం పెట్టుకున్నాం. దీటుగా స్పందించేలా స్వేచ్ఛను ఇచ్చాం. మనవాళ్లు ఇచ్చిన సమాధానం చూసి.. ఉగ్రవాదులు, వారి వెనుకున్నవారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు..'' అని ప్రధాని పేర్కొన్నారు.

**ఉగ్రవాదుల అంతం కోసం తేదీలు చూడాలా?**

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పార్లమెంటు సమావేశాల సమయంలోనే హతం చేయడం ఏమిటంటూ కాంగ్రెస్, ఇతర పక్షాలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. ''అసలు వాళ్లకు ఏమైంది? బాగా నిరాశ చెందినట్టున్నారు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఏమయ్యారని వారే అడిగారు. మోదీ ఓడిపోయాడంటూ సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు మేం ఉగ్రవాదులను హతం చేస్తే ఏడుస్తున్నారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి తేదీలు చూడాలా? ఈ తీరును చూసి దేశమంతా నవ్వుతోంది'' అని పేర్కొన్నారు. ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కి తీసుకురావడం లేదేమని కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని.. అసలు దేశ విభజనకు అంగీకరించినదెవరని, కశ్మీర్‌ను ఆక్రమించుకునే అవకాశం ఎవరిచ్చారని మోదీ ప్రశ్నించారు. పాక్‌తో సింధూ నది ఒప్పందం ఎవరు చేసుకున్నారని నిలదీశారు. నది మనది, నీళ్లు పాకిస్థాన్‌కు అనేలా చేశారని, నాటి తప్పులకు ఇప్పటికీ శిక్ష అనుభవిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు సింధు ఒప్పందం నిలిపివేత వంటి చర్యలతో వాటిని సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## పాక్‌తో పోరాడే సంకల్పమే మీకు లేదు



ఈ కబురు,న్యూఢిల్లీ: పెహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు మనదేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఆక్షేపించారు. పాకిస్థాన్‌తో పోరాటం చేసేందుకు ప్రభుత్వానికి రాజకీయ సంకల్ప బలమే లేకుండాపోయిందని విమర్శించారు. సాయుధ బలగాల చేతులను కట్టేసి, పాక్‌పై దాడికి దిగాలని ఆదేశించారని దుయ్యబట్టారు. భారత్‌పాక్ మధ్య సంఘర్షణను నివారించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ ఆయన చెబుతోంది అబద్ధం అని ప్రధాని మోదీ ఎందుకు చెప్పలేకపోతున్నారు? అని రాహుల్ ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. పెహల్గాం ఘటనలో మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. దాడికి ప్రతీకారంగా బలగాలు, ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై ఇండీ కూటమి ఒక్కతాటిపై నిలిచి మద్దతు పలికిందని గుర్తు చేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్‌ను, 1971 నాటి యుద్ధంతో పోల్చడాన్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 1971లో జరిగిన యుద్ధంలో రాజకీయ సంకల్పం ఉందన్నారు. మనదేశంపై అమెరికా ఒత్తిడి చేసినా, తన నౌకాదళాన్ని హిందూ మహాసముద్రంలో మోహరించినా నాటి ప్రధాని ఇందిరా గాంధీ వెనక్కు తగ్గలేదన్నారు. అమెరికా.. విమాన వాహక నౌకతో వస్తున్నా ఇందిర డోంట్ కేర్ అన్నారని.. 'బంగ్లాదేశ్‌లో మేం ఏం చేయాలనుకున్నామో అది చేసితీరుతాం' అని అమెరికాకు ఆమె స్పష్టం చేశారని చెప్పారు. ఆమె ఆలోచనలో గందరగోళం లేదని.. దీన్నే 'రాజకీయ సంకల్ప బలం' అంటారని రాహుల్ నొక్కి చెప్పారు. పాక్‌తో యుద్ధం చేసేందుకు రాజకీయ సంకల్ప బలం లేదన్న విషయాన్ని ఒకరకంగా రక్షణమంత్రి రాజ్‌నాథే పాక్‌కు చెప్పారని రాహుల్ ఆరోపించారు. అర్ధరాత్రి 1:35 గంటలకు పాక్‌కు ఫోన్ చేసి.. సైనికేతర లక్ష్యాలపైనే దాడి చేశామని.. ఉద్రిక్తతలను పెంచడం తమ లక్ష్యం కాదని చెప్పినట్లుగా స్వయంగా రాజ్‌నాథే వెల్లడించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మిలటరీ లక్ష్యాలను టార్గెట్ చేసుకోరంటే.. దానర్థం, పోరాటానికి రాజకీయ సంకల్పం లేనట్లేనన్నారు. ఇది.. 'మేం మీకు లెంపకాయ వేశాం. మరిన్ని లెంపకాయలు వేయబోం' అన్నట్లుగానే ఉందన్నారు. పాక్ మిలటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాయుసేన స్థావరాలపై దాడి చేయకూడదనే నిర్దేశించడంతోనే భారత్ కొన్ని ఎయిర్‌క్రాఫ్టలను కోల్పోవాల్సి వచ్చిందని ఇండోనేషియాలోని భారత రక్షణ అధికారి కెప్టెన్ శివ కుమార్ చెప్పారని రాహుల్ పేర్కొంటూ.. ఇది బలగాల చేతులు కట్టేయడం కాకపోతే మరేమిటి? అని ప్రశ్నించారు. కాగా పెహల్గాం ఘటనలో భద్రతా వైఫల్యానికి హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

## గాజాలో మారణహోమంపై మోదీ మౌనం సిగ్గుచేటు



ఈ కబురు,దిల్లీ: గాజాలో ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్న మారణహోమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ మండిపడ్డారు. పిరికితనం, భయంతో నైతిక విలువలకు మోదీ తిలోదకాలిచ్చారని విమర్శలు గుప్పించారు. ''గాజా సంకట్ పర్ మూక్ దర్శక్ మోదీ సర్కార్'' అనే శీర్షికతో ఓ ప్రముఖ హిందీ వార్త పత్రికకు సోనియా రాసిన వ్యాసం మంగళవారం ప్రచురితమైంది. పాలస్తీనా అంశంలో దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తున్న వైఖరిని ప్రధాని స్పష్టంగా, ధైర్యంగా, సూటిగా వ్యక్తం చేయాలని సోనియాగాంధీ ఆ వ్యాసంలో రాసుకొచ్చారు. మానవత్వంపై జరుగుతున్న ఈ ఘోరకలిని మోదీ ప్రభుత్వం మౌనంగా చూస్తుండటం సరికాదని, ఈ విధానం భారత ప్రజలను నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ అంశంలో భారత్ మొదటి నుంచీ రెండు దేశాల పరిష్కారం, ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల మధ్య శాంతికి మద్దతుదారుగా ఉందన్నారు. 1974లో ఇందిరా గాంధీ సారథ్యంలోని భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజల ఏకైక, చట్టబద్ధ ప్రతినిధి పాలస్తీనా విమోచన సమితి(పీఎల్ఓ)ని గుర్తించిందని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1988లో పాలస్తీనా దేశాన్ని అధికారికంగా గుర్తించిన తొలి దేశాలలో భారత్ కూడా ఉందన్నారు. పాలస్తీనా అంశంపై నాయకత్వం కోసం గ్లోబల్ సౌత్ మరోసారి భారత్ వైపు చూస్తోందని, ఆహారం, నీరు, ఔషధాలు, ఇంధనం గాజాలోకి ప్రవేశించకుండా అడ్డుకొని పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ హతమారుస్తున్న తీరును చూస్తుంటే 1948 నాటి 'నక్బా విషాదం' గుర్తుకు వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

## యుద్ధం ఎందుకు ఆపారో చెప్పరేం?

ఈ కబురు,దిల్లీ: పాకిస్థాన్‌పై మొదలైన యుద్ధాన్ని అకస్మాత్తుగా ఎందుకు ఆపాల్సి వచ్చిందనే ప్రశ్నకు కేంద్రం సమాధానం చెప్పడం లేదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంకా గాంధీ విమర్శించారు. ''పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల కోసం, మా తల్లి సోనియా గాంధీ కన్నీళ్ల కోసం లోక్‌సభలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరి దీనిపై మాత్రం ఎందుకు జవాబివ్వరు? శత్రువులు ఎక్కడికీ పారిపోలేని సమయంలో యుద్ధాన్ని ఎందుకు ఆపారు? ఇలా ఆకస్మికంగా యుద్ధాన్ని ఆపడం దేశ చరిత్రలోనే మొదటిసారి. ఆ ప్రకటనను కూడా అమెరికా అధ్యక్షుడు చేశారు. ఇది మన ప్రధాని బాధ్యతారాహిత్యాన్ని చాటుతోంది. మన దౌత్యం విఫలమైంది. నాయకత్వం అంటే ఖ్యాతినే కాదు.. బాధ్యత కూడా తీసుకోవాలి'' అని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? ''ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రధాని, హోంమంత్రి, రక్షణశాఖ, జాతీయ భద్రతా సలహాదారులకు లేదా? బైసరన్ వ్యాలీకి వేలల్లో పర్యాటకులు వస్తారని ప్రభుత్వానికి తెలియదా? ప్రభుత్వాన్ని నమ్ముకుని అక్కడకు వెళ్లినవారి భద్రతను భగవంతుడి దయకే ఎందుకు వదిలేశారు? ఇంత దారుణమైన ఉగ్రదాడి జరగనుందని, ఇందుకు పాక్ కుట్ర పన్నుతోందని నిఘా సంస్థలు ముందుగానే ఎందుకు పసిగట్టలేకపోయాయి? ఇది మన ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేశారా, కనీసం బాధ్యత తీసుకున్నారా? గతం గురించే మాట్లాడతారు కానీ, ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలపై మాత్రం సమాధానం చెప్పరు. ఆ ఆపరేషన్‌లో మన విమానాల్లో ఒక్కటి కూడా కూలిపోకపోతే ఆ విషయాన్ని పార్లమెంటులో చెప్పడానికి ఇబ్బందేమిటి? '' అని ప్రియాంక తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాట్లాహౌస్ ఉగ్రవాదుల కోసం సోనియా ఏడ్చారని హోంమంత్రి చెప్పడాన్ని ఆమె ఖండించారు. తన తల్లి 44 ఏళ్ల ప్రాయంలో ఉన్నప్పుడు భర్తను కోల్పోయారని, అప్పుడు మాత్రం ఆమె విలపించారని చెప్పారు. ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి.. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారి గురించి మాట్లాడుతున్నానని వారందరి పేర్లు ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైనిక జనరల్ అమెరికా అధ్యక్షుడితో విందులో పాల్గొనడం, ఉగ్రవాద వ్యతిరేక కమిటీకి ఐరాసలో సారథ్య బాధ్యతను పాక్ చేపట్టడం మన వైఫల్యాలని నిప్పులు చెరిగారుసమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ చేపట్టడం నిఘా వర్గాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. దీనివల్ల విలువైన ప్రాణాలు పోవడంతోపాటు సరిహద్దు భద్రతలో వైఫల్యాలు బహిర్గతం అయ్యాయని అన్నారు. విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాక్ కంటే చైనా పెద్ద శత్రువు అని, అది మన భూమిని, మార్కెట్లను కబళిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మనకు బాసటగా ఏ దేశం నిలవకపోవడం విదేశాంగ విధానంలో చీకటి దశ అని అన్నారు. డీఎంకే సభ్యురాలు కనిమొళి కూడా మోదీపై విరుచుకుపడ్డారు. విశ్వగురుగా చెప్పుకొనే ఆయన తన సొంత ప్రజలు విఫలమయ్యేలా చేశారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికీ విపక్షాన్నే ఆడిపోసుకుంటోందన్నారు.



## డీఎస్సీ2003 ఉపాధ్యాయులు పాత పెన్షన్‌కు అర్హులే: హైకోర్టు



**ఈ కబురు, హైదరాబాద్: డీఎస్సీ-2003 నోటిఫికేషన్ కింద నియమితులైన ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానానికి అర్హులంటూ హైకోర్టు మంగళవారం తేల్చి చెప్పింది. 2003 నోటిఫికేషన్ కింద నియమితులైన తమకు పాత పెన్షన్‌ను వర్తింపజేయకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది రవిచందర్, న్యాయవాది బొబ్బిలి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ 2003 నోటిఫికేషన్ కింద నియమితులైన పిటిషనర్లకు 2004 ఆగస్టు 31వరకు అమల్లో ఉన్న పాత పెన్షన్ పథకాన్ని వర్తింపజేయడంలేదన్నారు. 2004 సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని వర్తింపజేయడం సరికాదన్నారు. 2003 కంటే ముందు ఉన్న టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి 2003లో జారీచేసిన నోటిఫికేషన్ కింద ఎంపిక ప్రక్రియ మొత్తం 2004 జూన్ కల్లా పూర్తయిందన్నారు. పాలనాపరమైన జాప్యం కారణంగా 2005 నవంబరులో నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. పరిపాలనాపరమైన కారణం వల్ల జూన్‌లో ప్రక్రియ పూర్తయినప్పటికీ నియామకాలు ఆలస్యంగా జరిగాయని, అందువల్ల వీరు పాత పెన్షన్ పథకానికి అర్హులేనని తెలిపారు. వారికి పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.**

**తీర్పు చరిత్రాత్మకం: హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని, అది వేల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని రాష్ట్ర సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు.**

## ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు



ఈ కబురు, హైదరాబాద్: రానున్న పాతికేళ్ల అవసరాలకు తగ్గట్టుగా హైదరాబాద్ నగరాన్ని అందంగా... ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం పచ్చదనం, తాగునీరు, మురుగునీరు, ప్రజా రవాణా వంటి ప్రతి అంశంలోనూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నగరంలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) వెలుపలకు తరలించాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ మంగళవారం ఇక్కడ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా జరిగిన సుదీర్ఘ సమావేశంలో నగరాభివృద్ధికి సంబంధించి ప్రతి అంశాన్నీ చర్చించారు. ''దిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాలలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూడాలి. ఇందుకు అవసరమైన అన్ని సంస్కరణలూ చేపట్టండి. దీనికి తగ్గట్టుగానే ప్రణాళిక రూపొందించాలి. అవసరమైతే దిల్లీ, ముంబయి, చెన్నై నగరాల్లో పర్యటించండి. అక్కడున్న పరిస్థితులను అధ్యయనం చేయండి. నగరంలో భూగర్భ డ్రెయినేజీ, భూగర్భ విద్యుత్తు కేబుల్ అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయండి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని గట్టిగా అమలు చేయాలి. నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ డంప్ చేయడానికి వీల్లేదు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించండి. నగరంలో తాగునీరు, మురుగునీటి వ్యవస్థల సంస్కరణకు జలమండలి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అందుబాటులోని వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలన్న దానిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలి'' అని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాతబస్తీలో మెట్రో పనుల గురించి చర్చించిన ముఖ్యమంత్రి... అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేశామని, పనులు వేగవంతం చేయాలని అన్నారు.''మెట్రోరైలు తదుపరి దశలపై కేంద్ర పట్టణాభివృద్ధిశాఖతో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పట్టాలెక్కేలా చూడండి. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకూ ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి. నగరంలో వారసత్వ కట్టడాలను సంరక్షించి వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కులీకుతుబ్‌షాహి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించండి. మరింత బలోపేతం చేయండి'' అని సీఎం స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ పనుల గురించి కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ''హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకూ పనులు వేగవంతం చేయాలి. ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ తరహాలో కొత్వాల్‌గూడా జంక్షన్ వద్ద ఒక ల్యాండ్‌మార్క్ కట్టడం నిర్మించాలి. వంతెనలు, బ్యారేజీల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయండి'' అని నిర్దేశించారు. నెహ్రూ జూపార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. జూపార్క్, మీరాలం చెరువులకు సమీపంలో పర్యాటకులు బస చేసేలా, ఇక్కడ నుంచి నగరం మొత్తం వీక్షించేలా ఆధునిక వసతులతో హోటళ్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌కు సుప్రీంకోర్టులో ఊరట

ఈ కబురు, న్యూఢిల్లీ: గోపన్‌పల్లి భూ వివాదం కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎన్. పెద్దిరాజు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ట్రాన్స్‌ఫర్ పిటిషన్‌ను మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసుమి భట్టాచార్యపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు పిటిషనర్ పెద్దిరాజు, అతని తరఫు న్యాయవాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.వారిపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో ఆగస్టు 11న తదుపరి విచారణ సందర్భంగా వ్యక్తిగతంగా హాజరై సమాధానం ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. 'న్యాయమూర్తులను ఇబ్బందికర స్థితిలోకి నెట్టేలా ఎవరైనా ఆరోపణలు చేయడం మేము సహించం. ఇలాంటి వ్యవహారాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఇలాంటి చర్యలతో న్యాయవ్యవస్థ పరువు పోతుంది. అలాంటి వ్యాఖ్యలపై కఠినంగా వ్యవహరించాలి.ఇక్కడ మేము న్యాయవాదులను కూడా రక్షించాలనే ఉద్దేశంతో ఉన్నాం'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రేవంత్ రెడ్డికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇతర న్యాయస్థానానికి బదిలీ చేయాలంటూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును రద్దుచేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆరోపణలు చేస్తూ పెద్దిరాజు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాది రితేష్ పాటిల్ ట్రాన్స్‌ఫర్ పిటిషన్‌ను వెనక్కు తీసుకుంటామని సుప్రీంకోర్టును కోరారు. అయితే ధర్మాసనం నిరాకరించింది. 'ఇది కేవలం లిటిగెంట్ తప్పు మాత్రమే కాదు, అలాంటి వ్యాఖ్యలపై సంతకం చేసిన న్యాయవాది కూడా కోర్టు ధిక్కారానికి బాధ్యత వహించాలి. 'మీరంతా మొదట న్యాయమూర్తిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు సమర్పించండి. అవి నిజాయితీగా ఉన్నాయో లేదో చూస్తాం. అంతేతప్ప, మీరు పిటిషన్ వెనక్కు తీసుకుంటామంటే క్షమించలేం'అని ధర్మాసనం స్పష్టం చేసింది. రేవంత్ రెడ్డి తరఫున సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు.

**అసలు ఏం జరిగిందంటే..**

గోపన్‌పల్లిలో సర్వే నంబర్ 127లోని సొసైటీకి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో 2016లో కేసు నమోదైంది. పెద్దిరాజు ఫిర్యాదు మేరకు.. ఏ-1గా కొండల్ రెడ్డి (రేవంత్ రెడ్డి సోదరుడు), ఏ-2గా ఈ.లక్ష్మయ్య, ఏ-3గా రేవంత్ రెడ్డిని చేర్చారు. ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని రేవంత్ 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై హైకోర్టులో వాదనలు విన్న జడ్జి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య ధర్మాసనం.. రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని ఫిర్యాదుదారు సైతం అంగీకరించారని పేర్కొంది. తాను లేను కాబట్టి తనపై కేసు కొట్టేయాలని అడుగుతున్నారని, మిగతా వారిపై కేసుకొట్టేయాలని అడగటం లేదని వ్యాఖ్యానించింది. రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకే దూషించాడనే ఆరోపణలకు ఆధారాలు లేవని తెలిపింది. ఈ క్రమంలో జూలై 18న రేవంత్‌పై నమోదైన కేసును కొట్టేసింది.

## బనకచర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరిం



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం... వ్యవసాయ సంక్షోభాన్ని నివారించేందుకు... రాజీ లేని పోరాటాలు మరింత ఉధృతం చేయాలని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసేలా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిందంటూ.. దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం భారాస శ్రేణులను క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎర్రవల్లి నివాసంలో మంగళవారం భారాస అధినేత కేసీఆర్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఇందులో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ పలు సూచనలు చేశారు. ''తెలంగాణ రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి.. ఆంధ్రా ప్రయోజనాలను కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ రైతులకు శాశ్వత అన్యాయం ఒడిగడుతున్న సర్కారు దుర్మార్గపు వైఖరిని ఎండగట్టాలి. ఇక్కడ చంద్రబాబు, అక్కడ మోదీల ప్రయోజనాలను కాపాడేందుకు ముఖ్యమంత్రి తహతహలాడుతుండడాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టి... వానాకాలం నాట్లు అయిపోతున్నా.. ఇంతవరకు రైతాంగానికి సాగునీరు అందించని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజాక్షేత్రంలో నిలదీయాలి. ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర గోదావరి జలాలను ఎత్తిపోయాలి. పంపులను ఆన్ చేయాలి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపాలి. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. రైతులు వరినాట్లు వేసుకుంటున్న సందర్భంలో.. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరం. దీనిపై పోరాటాలు చేయాలి. కాంగ్రెస్, భాజపాలు పరస్పర విమర్శలతో కాలయాపన చేస్తూ.. రాష్ట్ర ప్రజల సమస్యలను గాలికి వదిలేస్తున్నాయి. ఆ రెండు పార్టీలనూ గట్టిగా నిలదీయాలి. ప్రజా సమస్యలపై పోరాడేందుకు అనుబంధ విభాగాలన్నింటినీ పటిష్ఠం చేయాలి. క్షేత్రస్థాయి పోరాటంలో ప్రజలను మమేకం చేయాలి'' అని కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దిల్లీ వేదికగా కొట్లాడాలని నిర్ణయించడంతో.. ఈ విషయంలో భారాస ఎలా ముందుకెళ్లాలనే అంశంపై అధినేత చర్చించినట్లు తెలిసింది. కులగణనను ప్రభుత్వం శాస్త్రీయంగా చేయలేదని, బీసీ బిల్లును హడావిడిగా ఆమోదించి దిల్లీకి పంపించారని, ఆర్డినెన్స్ పేరిట బీసీలను మోసం చేస్తున్నారని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనేది తమ పార్టీ డిమాండ్ అని.. ఈ అంశంపై గ్రామాల్లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. భాజపా ఎంపీ రమేశ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెలిసింది. భారాసపై దుష్ప్రచారానికి గట్టిగా సమాధానమివ్వాలని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పినట్లు తెలిసింది.

మొదటి పేజీ తరువాయి

# వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగం..



ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్

**ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్యాంకర్**
**సాఫ్టువేర్ ఉద్యోగిని దుర్మరణం**

ఈకబురు, శేరిలింగంపల్లి : వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం అతివేగం ఓ ఇద్దరూ బిడ్డలకు తల్లిని దూరం చేసింది. సంతోషంగా తన పిల్లలను స్కూలుకి పంపించి తిరిగి ఇంటికి వస్తున్న తల్లిని వాటర్ ట్యాంకర్ రూపంలో మృత్యువు కబళించింది మణికొండలో వాటర్ ట్యాంకర్ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం మీద ఉన్న సాఫ్ట్వేర్ ఉద్యోగిని అక్కడికక్కడే మృతి చెందింది రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మణికొండ పుప్పాలగూడలోని బీఆర్‌సి అపార్ట్మెంట్ లో ఇరువురి శాలిని(38) తన భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు పిల్లలు సుదీక్ష, సహస్రతో కలిసి నివాసం ఉంటుంది. శాలిని ఐటీ కారిడార్‌లోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, సుదీక్ష 9వ తరగతి, సహస్ర 4వ తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం ఇద్దరు పిల్లలను స్కూల్ బస్సు ఎక్కించడానికి తన స్కూటీపై దర్గా ఎక్స్ రోడ్డు వద్దకు వెళ్లి బస్సు ఎక్కించింది. అనంతరం తన స్కూటీపై ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యంలో సుందర్ గార్డెన్ వద్దకు రాగానే వెనుక నుండి వేగంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్ శాలిని స్కూటీని ఢీకొట్టింది. స్కూటీపై నుండి కిందపడిపోయిన శాలిని తలపై నుండి ట్యాంకర్ టైర్లు వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలై స్పాట్‌లోనే మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన శాలిని(ఫైల్)

# నేడు నింగిలోకి జీఎస్ఎల్‌వీఎఫ్16



**ఈ కబురు, రత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ మరో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 ప్రయోగం చేపట్టేందుకు కౌంట్‌డౌన్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లనుంది. జీఎస్ఎల్‌వీ.. నాసా, ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రాడార్ ఉపగ్రహాన్ని సూర్య అనువర్తిత కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. జీఎస్ఎల్‌వీ బయలుదేరిన 18.59 నిమిషాలకు 747 కిలోమీటర్ల ఎత్తులో 2,392 కిలోల బరువున్న నైసార్ ఉపగ్రహం విడిపోనుంది. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ కౌంట్‌డౌన్ ప్రక్రియ, జీఎస్ఎల్‌వీని పరిశీలించి వచ్చారు. రాకెట్ ప్రయోగం దృష్ట్యా ఇస్రోలోని వివిధ కేంద్రాల డైరెక్టర్లు, సీనియర్ శాస్త్రవేత్తలు షార్‌కు విచ్చేశారు. నాసాకు చెందిన శాస్త్రవేత్తలూ షార్‌కు చేరుకున్నారు.**

మొదటి పేజీ తరువాయి

# బీసీ బిల్లుకు కేంద్రం అడ్డంకులు

ఈ కబురు ,తాండూరు: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ విషయమై త్వరలోనే మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రపతిని కలవనున్నట్లు చెప్పారు. బీసీ బిల్లు ఆమోదాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని కేంద్రానికి సూచించారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి భట్టి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణ శివారులోని జీపీఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో విసిగిపోయిన ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేయించామన్నారు.

95 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నాం

రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకుగాను 95 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రేషన్ కార్డు కలిగిన వారికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని భట్టి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ పథకం కింద పేదలకు సొంత ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు మంజూరు చేశామన్నారు.

పేద విద్యార్థుల దశదిశ మారుతుంది

యాలాల మండలం దౌలాపూర్ శివారులో రూ.250 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 104 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. పోటీ ప్రపంచంలో నిలబడేలా ఇందులో విద్యార్థులను తీర్చిదిద్దుతామని.. తద్వారా పేద, బలహీన వర్గాల విద్యార్థుల దశ, దిశ మారుతుందన్నారు. తాండూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ సీఎం చెన్నారెడ్డి, మాణిక్‌రావు, చంద్రశేఖర్‌రావు వంటి వారు తమదైన ముద్రవేశారని గుర్తుచేశారు.

కాన్వాయ్ ఆపి.. చిరు వ్యాపారిని పలకరించి..



ధారూరు: తాండూరు పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ తిరిగి వెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి ధారూరు మండలం అనంతగిరి చివరి గుట్ట వద్ద తన కాన్వాయ్‌ను ఆపి మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్న మహ్మద్ చాంద్ వద్దకు వెళ్లి కంకులు కొనుగోలు చేశారు. రోజుకు ఎంత సంపాదిస్తావని అతన్ని అడగ్గా కూలీ సైతం గిట్టడం లేదని చాంద్ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై స్పందించిన భట్టి మీలాంటి చిరు వ్యాపారులకు త్వరలోనే ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# సాగర్ నుంచి కృష్ణమ్మ ఉరకలు

టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 14 క్రస్ట్‌గేట్లను ఎత్తి 2,38,727 క్యూసెక్కుల నీటిని అధికారులు పులిచింతలకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల నిండుకుండలా మారగా, డ్యాం మూడు క్రస్టు గేట్లను ఎత్తి నీటిని ప్రకాశం బ్యారేజ్ వైపు వదిలారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,58,171 క్యూసెక్కు ఇన్‌ఫ్లో నమోదవగా, అవుట్ ఫ్లో 65,394 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 42.16 టీఎంసీలకు చేరింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 17,600 క్యూసెక్కుల నీరు కిందకు చేరుతోంది.

శ్రీశైలానికి వరద ఉధృతి..

జూరాల, సుంకేసుల నుంచి 2,89,670 క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం శ్రీశైలానికి వస్తుండడంతో మంగళవారం రాత్రి 8 రేడియల్ క్రస్ట్ గేట్లను తెరచి నాగార్జునసాగర్‌కు 2,16,520 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 31వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,818 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కుడిగట్టు కేంద్రంలో 15.638 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.065 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో 203.8907 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 882.90 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 203 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



# ఖమ్మం, నల్లగొండ మంత్రులు సీఎంను పని చెయ్యనివ్వట్లే!

- **ఖమ్మం, నల్లగొండ మంత్రులు సీఎంను పని చెయ్యనివ్వట్లే!**
- **19 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత**
- **42 శాతం రిజర్వేషన్ బీసీలకు కాదు.. ముస్లింలకు!**
- **ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**
- **కమ్యూనిస్టులు బీజేపీలో చేరాలని పిలుపు**
- **ఎరువుల పంపిణీపై చర్చకు రావాలని మంత్రి తుమ్మలకు సవాల్**

ఈ కబురు,ఖమ్మం: ఖమ్మం, నల్గగొండ జిల్లాలకు చెందిన మంత్రుల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పని చెయ్యనివ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో రైతు బంధు సహా ఏ సంక్షేమ పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. దాంతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. ఎరువుల పంపిణీ అంశంలో చర్చకు సిద్ధమా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సవాలు విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో మంగళవారం తొలిసారి ఖమ్మం వచ్చిన ఆయన స్థానికంగా నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి బదులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బీసీలకు కాదని ముస్లిం రిజర్వేషన్ అని ఆరోపించారు. ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదన్న ఆయన.. ముస్లింలకు 10 శాతం ఈబీసీ రిజర్వేషన్, 4 శాతం రిజర్వేషన్ అమలులో ఉందని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్సు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కేంద్రంపై బురద చల్లుతూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.హైదరాబాద్ జీహెచ్ఎంసీలో బీసీల సీట్లలో 32మంది ఎంఐఎం అభ్యర్థులు గెలిచారని, తద్వారా బీసీల రిజర్వేషన్ కోటా బీసీలకు దక్కకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందన్న రాంచందర్‌రావు.. పశ్చిమ బెంగాల్ నాయకులను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని కమ్యూనిస్టు నేతలు బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. ఖమ్మంను ఒకప్పుడు కమ్యూనిస్టుల గడ్డ అనేవారని, ఇకపై ఖమ్మం బీజేపీ అడ్డా కాబోతుందని తెలిపారు. ఇక, కేంద్ర ప్రభుత్వం ఎరువులు సక్రమంగా సరఫరా చేయడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచన చేశారు. 202425లో 9.80 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చిందని, 2024లో 12.47లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూరియా అసలు ధర రూ.1990 ఉంటే బస్తాకు రూ.1423 సబ్సిడీ ఇచ్చిందని, డీఏపీ బస్తా రూ.2440 ఉంటే కేంద్రం రూ.1090 సబ్సిడీ ఇస్తోందన్నారు. ఎరువులు పంపిణీపై తనకు అవగాహన లేదన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. దమ్ముంటే ఎరువులపై తనతో చర్చకు రావాలని సవాలు చేశారు. తాను చెప్పేది అసత్యమైతే బీజేపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని, అదే తుమ్మల తప్పయితే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, ఇందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



మొదటి పేజీ తరువాయి

# దిగువకు కృష్ణమ్మ పరవళ్లు



ఈ కబురు, నాగార్జునసాగర్/యాదాద్రి/హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ జలాశయం నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు మొదలయ్యాయి. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడం, గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11:28 గంటలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఉత్తమ్ తొలుత 13వ నంబరు గేటును ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం మరికొన్ని గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మకు వాయినం సమర్పించారు. గేట్లు ఎత్తిన తర్వాత ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తొలగించడంతో పాటు ఆధునికీకరిస్తామని చెప్పారు. సాగర్ ప్రాజెక్టు గేట్లు జూలై నెలలో ఎత్తడం 18 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 22 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తోందని తెలిపారు. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఉంటూ ప్రస్తుతం మంత్రిగా ఉండి సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీరు అందించామని.. ఫలితంగా 2.81 లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్కేంద్రం ద్వారా గడిచిన నాలుగు రోజుల్లో రోజుకు 30వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటూ 700 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశామని తెలిపారు. కాగా, ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువకు నీటి విడుదలను పెంచారు. ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా మంగళవారం మరో 2,500 క్యూసెక్కులను మంత్రి ఉత్తమ్ చేతుల మీదుగా పెంచి, విడుదల చేశారు. మంగళవారం ఉదయం మంత్రులు 6 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత ఎగువ నుంచి వరద పెరగడంతో సాయంత్రం 4 గంటలకల్లా 26 గేట్లనూ ఎత్తారు. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. మంగళవారం సాయంత్రానికి 587.60అడుగులుగా నమోదైంది. 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి (2,30,804 క్యూసెక్కులు); కాలువలు, విద్యుదుత్పత్తి ద్వారా మొత్తం 2,75,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా.. ఎగువ నుంచి 2,55,811 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మంత్రి కోమటిరెడ్డి గైర్హాజరు

సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తే కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గైర్హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం మంత్రి వెంకటరెడ్డి కూడా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో సాగర్‌కు రావాల్సి ఉంది. అయితే మంత్రి వెంకటరెడ్డి గైర్హాజరవడంతో ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో పలు రకాల కథనాలు ప్రసారమయ్యాయి. బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద గంటసేపు వేచి ఉండాల్సి రావడంతో చిరాకుతో మంత్రి వెంకటరెడ్డి సాగర్‌కు రాకుండా వెనక్కి వెళ్లిపోయారని కథనాలు ప్రసారమయ్యాయి.

గేమ్‌ఛేంజర్‌గా సన్నబియ్యం, రేషన్‌కార్డులు

రాష్ట్ర రాజకీయాల్లో సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ పథకాలు గేమ్‌ఛేంజర్‌గా మారాయని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, కట్టంగూరుల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఉత్తమ్ నూతన రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రెండు పథకాలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యం అందిస్తే వాటిని రీసైక్లింగ్ చేసి కాకినాడ పోర్టుకు తరలించారని, కోళ్ల ఫారాలకు అమ్ముకున్నారని తెలిపారు. తెలంగాణలో అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందిస్తున్నామన్నారు. పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం 3.15 కోట్ల మందికి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని శాసించే శక్తి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉందని, ఈ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల త్యాగంతోనే ప్రభుత్వం ఏర్పడిందని ఉత్తమ్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలపై దృష్టి పెట్టలేదని, ప్రజాపాలనలో ప్రతి పేదవాడు కడుపు నిండా అన్నం తినాలన్న లక్ష్యంతో నూతనంగా రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల దీక్ష

**స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు.**

**బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల దీక్ష**

**ఇందిరా పార్కు వద్ద ఆగస్టు 4 నుంచి 7 వరకు నిర్వహణ**

**ఆర్డినెన్స్, బిల్లుల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయ పోరాటం చేయట్లేదు?: ఎమ్మెల్సీ కవిత**

పంజాగుట్ట, జూలై 29 : స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో ఆగస్టు 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు తన దీక్ష కొనసాగుతుందని ప్రకటించారు. హైకోర్టు చెప్పిన గడువులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడమూ అంతే ముఖ్యమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకపోవడం, బీసీ బిల్లులపై రాష్ట్రపతి స్పందించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయ పోరాటం చేయట్లేదని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం యునైటెడ్ పూలే ఫ్రంట్ (యూపీఎఫ్), బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించే సమయంలో అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీనే పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుళ్లకుండా, పార్టీ పరంగా ధర్నా చేస్తామని చెప్పడం బీసీలను వంచించడమేనని ధ్వజమెత్తారు.



# భారత్‌పై ఎంత శాతం టారిఫ్ విధించవచ్చో హింట్ ఇచ్చిన ట్రంప్

ఈ కబురు ,వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ వాయిదా గడువు ఆగస్టు 1 లోపు ఒప్పందం కుదరకుంటే గరిష్ఠంగా 25 శాతం సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. వైట్ హైస్‌లో రిపోర్టర్లతో ట్రంప్ మాట్లాడుతూ.. ''భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా ఫైనల్ కాలేదు. 20 నుంచి 25 శాతం సుంకాలు విధించే ఆలోచనలో ఉన్నాం. నా విజ్ఞప్తి మేరకు ఇండియా, పాక్‌లు యుద్ధాన్ని ముగించాయి. భారత్ తమకు మంచి మిత్ర దేశం. అయితే ఇతర దేశాలతో పోలిస్తే ఇండియా తమపై భారీగా సుంకాలు విధించింది'' అని పేర్కొన్నారు.

ట్రంప్ రెండోసారి అధికారంలో వచ్చాక అమెరికా దిగుమతులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. గత ఏప్రిల్ 2న అన్ని దేశాలపై ప్రతీకార సుంకాల మోత మోగించారు. ఆయా దేశాలు అమెరికాపై విధిస్తున్న సుంకాల్లో 50 శాతం విధించారు. భారత్‌పై 26 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆయా దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చునేందుకు 90 రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. అప్పటిదాకా అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. అనంతరం ఆ గడువు ముగియడంతో ఆగస్టు 1 వరకు పొడిగించారు. ఆ గడువు ఇంకా రెండు రోజులే మిగిలి ఉంది.




# 4 ఏళ్లలో రెట్టింపు పెరిగిన స్థిరాస్తి రంగ రుణాలు





ఈ ఏడాది మార్చి నాటికి భారత స్థిరాస్తి రంగంలో బ్యాంకు క్రెడిట్‌ల విలువ రూ. 35.3 లక్షల కోట్లకు చేరింది. ఇది గత నాలుగేళ్లలో దాదాపు రెట్టింపు అయిందని ప్రముఖ కన్సల్టెంట్ సంస్థ కొలియర్స్ మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. లాభదాయకత, నిధుల వినియోగం, మార్కెట్ పనితీరు ఆధారంగా దేశంలోని టాప్50 లిస్టెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలను బట్టి ఈ అంచనా వేసినట్టు కొలియర్స్ పేర్కొంది. భారత స్థిరాస్తి రంగం కొవిడ్19 మహమ్మారి తర్వాత ఆర్థికంగా గణనీయమైన రికవరీ సాధిస్తోంది, కీలకమైన క్రెడిట్ విషయంలో ఇతర ప్రధాన పరిశ్రమల కంటే ముందుంది. తద్వారా రియల్ ఎస్టేట్ రంగం క్రెడిట్ యాక్సెస్ పరంగా పూర్తిస్థాయిలో మెరుగు పడిందని భావించవచ్చని కొలియర్స్ ఇండియా అభిప్రాయపడింది. ఈ రంగంతో పాటు మొత్తంగా దేశంలో బ్యాంకు క్రెడిట్ గణనీయంగా పెరిగింది. అన్ని రంగాలకు కలిపి 202021లో రూ. 109.5 లక్షల కోట్ల క్రెడిట్‌ను బ్యాంకులు ఇవ్వగా, 202425 నాటికి ఇది రూ. 182.4 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఒక్క రియల్ ఎస్టేట్ రంగంలో బ్యాంకు క్రెడిట్‌లు రూ. 17.8 లక్షల కోట్ల నుంచి రూ. 35.3 లక్షల కోట్లకు దాదాపు రెట్టింపు అయ్యాయని ఆర్‌బీఐ డేటాను నివేదిక ప్రస్తావించింది.

దేశంలోని బ్యాంకు క్రెడిట్ విస్తరణలో రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు దాదాపు ఐదవ వంతు వాటా కలిగి ఉంది. ఈ రంగంపై బ్యాంకుల విశ్వాసం పెరుగుతోందని కొలియర్స్ తెలిపింది. అయితే ఇప్పటికీ భారత రియల్ ఎస్టేట్ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే స్థిరంగా, ఆర్థిక భరోసాను కొనసాగిస్తోందని కొలియర్స్ ఇండియా సీఈఓ బాదల్ యాగ్నిక్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇతర రంగాల కంటే రియల్ ఎస్టేట్ రంగంలో క్రెడిట్ రేటింగ్ అప్‌గ్రేడ్‌లు అధికంగా జరిగాయని ఆయన చెప్పారు. నివాస, వాణిజ్య, పారిశ్రామిక, గిడ్డంగులు, రిటైల్, హాస్పిటాలిటీ మొదలైన విభాగాల్లో బలమైన డిమాండ్‌సరఫరా ద్వారా రియల్ ఎస్టేట్ రుణాలకు అధిక క్రెడిట్ నాణ్యత లభిస్తోందని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగానికి బ్యాంక్ క్రెడిట్ అంటే ఆస్తికి సంబంధించిన కార్యకలాపాల కోసం వ్యక్తులు, వ్యాపార వర్గాలకు బ్యాంకులు అందించే రుణాలు, ఇతర ఫైనాన్సింగ్ సౌకర్యాలు. దీనర్థం.. ఆస్తి కొనుగోలు, ఇళ్ల నిర్మాణాలు, ఇంటి పునర్నిర్మాణం, భూమిని కొనడం వంటి అన్ని రకాల స్థిరాస్తి కార్యకలాపాలకు బ్యాంకు ఇచ్చే లోన్లను బ్యాంక్ క్రెడిట్‌గా పరిగణిస్తారు.



## టీసీఎస్ లేఆఫ్స్‌తో ఆర్థిక ప్రకంపనలు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా తన మొత్తం సిబ్బందిలో 2 శాతం ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్పందించారు. టీసీఎస్ ప్రకటన ఆర్థిక ప్రకంపనలకు(ఎకనామిక్ ఎర్త్‌క్వేక్) కారణమవుతుందన్నారు. భారతదేశపు అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టీసీఎస్ 12,261 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఇందులో ప్రభావితం చెందే వారిలో ఎక్కువ మంది మిడిల్, సీనియర్ గ్రేడ్ ఉద్యోగులు ఉండబోతున్నట్లు సంస్థ తెలిపింది. 2025 జూన్ 30 నాటికి టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. ఇటీవల ముగిసిన ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో 5,000 మంది ఉద్యోగులను చేర్చుకుంది. 'నైపుణ్యాల అసమతుల్యత వల్ల కంపెనీ ఈమేరకు ప్రకటన చేసి ఉండవచ్చు. ఏది ఏమైనా ఈ వార్త ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఇది ఆర్థిక ప్రకంకపనలు సృష్టిస్తుంది' అని జైరాం రమేష్ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. టెక్నాలజీ, కృత్రిమ మేధ, మార్కెట్ విస్తరణ, శ్రామిక శక్తి పునర్వ్యవస్థీకరణలో పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్తుకు సిద్ధంగా ఉంటున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ విస్తృత వ్యూహంలో భాగంగా లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు టీసీఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

# డిజిటల్ చెల్లింపులు జోరు.. ఆర్‌బీఐ – డీపీఐ సూచీ పరుగులు

**మార్చి చివరికి 10.7% పెరుగుదల**

**ముంబై:** ఇండియాలో డిజిటల్ చెల్లింపులు ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఆర్‌బీఐ - డిజిటల్ పేమెంట్స్ ఇండెక్స్ (ఆర్‌బీఐ-డీపీఐ) ఈ ఏడాది మార్చి నెలకు 493.22గా నమోదైంది. దీనికి ఆరు నెలల ముందు.. 2024 సెప్టెంబర్‌లో ఈ సూచీ 455.5గా ఉండడం గమనార్హం. అంటే డిజిటల్ చెల్లింపుల్లో 10.7% మేర వృద్ధి నమోదైంది. చెల్లింపుల సదుపాయాలు, సరఫరా వైపు అంశాలు ఆర్‌బీఐ-డీపీఐ సూచీ బలపడేందుకు దారితీసినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఐదు అంశాల ఆధారంగా చెల్లింపుల తీరును ఆర్‌బీఐ మదింపు వేస్తుంటుంది. ఇందులో చెల్లింపులు చేసే వారు (25% వెయిటేజీ), చెల్లింపులు సదుపాయాలు - డిమాండ్ వైపు అంశాలు (10%) పేమెంట్ సదుపాయాలు - సరఫరా వైపు అంశాలు (15%), చెల్లింపుల పనితీరు (45%), వినియోగదారుల కేంద్రీకరణ 5% చొప్పున వెయిటేజీ కలిగి ఉన్నాయి.






**విప్రో ఇన్‌ఫ్రా నుంచి కొత్త బిజినెస్**

న్యూఢిల్లీ: ఇంజినీరింగ్, తయారీ సొల్యూషన్లు అందించే విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ (విన్) తాజాగా కొత్త బిజినెస్ విభాగానికి తెరతీసింది. విప్రో ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ పేరుతో ఏర్పాటు చేసిన విభాగంపై రూ. 500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొంది. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీలు) తయారీలో ఉపయోగించే బేస్ మెటీరియల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం కర్ణాటకలో కాపర్ క్లాడ్ లామినేట్ (సీసీఎల్) తయారీ యూనిట్‌ను నెలకొల్పుతున్నట్లు వివరించింది. దీంతో సుమారు 350 మందికి ఉపాధి లభించనుంది.

**పెగాసిస్టమ్స్ డెవలపర్ల కోసం ఎక్స్‌పర్ట్ సర్కిల్స్**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా తమ డెవలపర్ల కోసం ఎక్స్‌పర్ట్ సర్కిల్స్ సెషన్లను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా తమ డెవలపర్లలో 50 శాతం మంది భారత్‌లో ఉన్నారని, వారు తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని పెగాఇన్నోవేట్ 2025 కార్యక్రమం సందర్భంగా కంపెనీ ఎండీ దీపక్ విశ్వేశ్వరయ్య తెలిపారు. పెగా ప్రధాన టెక్నాలజీలైన బ్లూప్రింట్, యాప్ డిజైన్‌లాంటి టెక్నాలజీలు తదితర అంశాల గురించి ఈ సెషన్స్‌లో చర్చిస్తారు. ఒక్కో సెషన్‌లో 50 మంది వరకు పాల్గొనవచ్చని దీపక్ చెప్పారు.

# జులై-29: తెలుగు రాష్ట్రాల్లో నేడు గ్యాస్ సిలిండర్ ధరలు..

నిత్యావసర వస్తువుల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. ఈ ధరలను ప్రతి నెల ఒకటో తేదీన సవరిస్తుంటారు. అయితే ఈ నెలలో అయినా ధరలు తగ్గుముఖం పోతాయేమోనని సామాన్య ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూశారు. అయితే కమర్షియల్ రేట్లను తగ్గించిన కంపెనీలు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాగా రీసెంట్గా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ ధరలు పెరిగాయి. 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్పై రూ.50 పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే నేడు తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**హైదరాబాద్: రూ. 905**
**వరంగల్: రూ.924**
**విశాఖపట్నం: రూ. 861**
**విజయవాడ: రూ.875**
**గుంటూరు: రూ. 877**



# పన్ను చెల్లింపుదారులకు ఊరట.. వేగవంతమైన ఐటీఆర్ రీఫండ్లు

**ఆదాయపన్ను చెల్లించేవారికి భారీ ఊరట లభించనుంది. సాధారణంగా ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్‌లు) దాఖలు చేసిన తర్వాత రీఫండ్ల కోసం చాలాకాలం వేచి ఉండాల్సి రావడం సాధారణం. అయితే, ఇది గతం కానుంది. అందరికీ కాకపోయినా, చాలామందికి ఇకపై త్వరితగతిన రీఫండ్లు అందే అవకాశం ఉంది. తాజాగా ప్రస్తుత ఏడాదికి సంబంధించి కొందరు పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను ఈ-ఫైలింగ్ చేసిన 4 గంటల్లోనే రీఫండ్లను పొందినట్టు చెప్పారు.**

దీంతో ఇకపై ఐటీఆర్ ప్రక్రియ అత్యంత వేగవంతం జరగనుంది. ఐటీఆర్ ప్రక్రియలో ఇది అతిపెద్ద మార్పుగా భావించవచ్చు. ఇప్పటివరకు అంటే గత 1213 ఏళ్లుగా రీఫండ్లకు 90 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టేది. అయితే, ప్రస్తుత అసెస్‌మెంట్ ఏడాదిలో కొంతమంది పన్ను చెల్లింపుదారులు తన రిటర్నులను దాఖలు చేసిన గంటల వ్యవధిలోనే పన్ను వాపసులను పొందినట్టు చెప్పారు.

ఈ విషయాన్ని నోయిడాకు చెందిన అరుణ్ ప్రకాశ్ అనే వ్యక్తి ధృవీకరించారు. తాను ఈఫలింగ్ పోర్టల్‌లో ఫారం 1 నుంచి రిటర్నులు దాఖలు చేసిన 4 గంటల్లోనే రీఫండ్ పొందినట్టు చెప్పారు. మరికొందరు కూడా ఇలాగే ఒకరోజులోనే రీఫండ్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఇందుకు ప్రధానంగా, డిజిటల్ ప్రాసెసింగ్ ప్రక్రియ, ఆదాయపు పన్ను శాఖ చేపట్టిన రిటర్నుల ప్రాసెసింగ్, ఆటోమేటెడ్‌గా ధృవీకరణల ద్వారా సాధ్యమైంది. అంతేకాకుండా ఇదివరకు ఎక్సెల్ సిస్టమ్ స్థానంలో జేఎస్ఓఎన్ ఫార్మాట్‌ను తీసుకురావడం వల్ల డేటా రీడింగ్ మరింత వేగవంతమైంది.







# జూన్‌లో కొత్తగా 19 లక్షల సబ్‌స్క్రైబర్లను సాధించిన జియో




దేశీయ టెలికాం రంగంలో రిలయన్స్ జియో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తాజాగా జూన్ నెలకు సంబంధించి టెలికాం సబ్‌స్క్రైబర్ల డేటాలో భారతీ ఎయిర్‌టెల్ కంటే రెండు రెట్లు ఎక్కువగా కొత్త కస్టమర్లను జియో సంపాదించినదని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ వెల్లడించింది. మంగళవారం విడుదల చేసిన డేటా ప్రకారం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ క్రమంగా సబ్‌స్క్రైబర్లను కోల్పోతున్నాయి. సమీక్షించిన నెలలో జియో కొత్తగా 19 లక్షల మంది కస్టమర్లను సంపాదించుకోగా, ఎయిర్‌టెల్ 7.63 లక్షల మందిని చేర్చుకుంది. ఇదే సమయంలో వొడాఫోన్ ఐడియా 2.18 లక్షల మందిని, బీఎస్ఎన్ఎల్ 3.06 లక్షల మందిని కోల్పోయాయని ట్రాయ్ వెల్లడించింది. మొత్తంగా జూన్‌లో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 20 లక్షల మంది పెరిగారు. తద్వారా దేశంలోని మొత్తం యూజర్ బేస్ 116.3 కోట్లకు చేరుకుంది. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో వైర్‌లెస్ యూజర్ బేస్ 5.1 లక్షల మంది తగ్గగా, పట్టణ ప్రాంతాల్లో 29.7 లక్షల మంది పెరిగారు. జూన్ నాటికి జియో మొత్తం 47.7 కోట్ల మంది కస్టమర్లను కలిగి ఉంది. దీని తర్వాత ఎయిర్‌టెల్, 39.1 కోట్లు, వొడాఫోన్ ఐడియా 20.42 కోట్లు, బీఎస్ఎన్ఎల్ 9.05 కోట్ల వినియోగదారులను కలిగి ఉన్నాయి. రిలయన్స్ జియో 41.02 శాతం మార్కెట్ వాటాతో దేశీయ టెలికాం మార్కెట్లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. ఎయిర్‌టెల్ 33.62 శాతం, వొడాఫోన్ ఐడియా 17.56 శాతం, బీఎస్ఎన్ఎల్ 7.78 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.






# రూ.100కే సూపర్ హిట్ సినిమా చూసేయండి.. ఎక్కడంటే?

బాలీవుడ్ స్టార్ హీరో అమిర్ ఖాన్ ఇటీవల సితారే జమీన్ పర్ అంటూ అభిమానులను పలకరించాడు. ఈ సినిమాకు ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించగా.. అమిర్ ఖాన్ నిర్మించారు. గతనెల 20న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. గతంలో విడుదలైన అమిర్ ఖాన్ చిత్రం తారే జమీన్ పర్ మూవీకి సీక్వెల్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.


**ఓటీటీఇచ్చేది లేదన్న అమిర్..**

అయితే ఈ సినిమాను ఓటీటీలో రిలీజ్ చేయబోనని అమిర్ ఖాన్ ఇప్పటికే ప్రకటించారు. అయితే తాను ముందుగానే ప్రకటించినట్లు యూట్యూబ్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ విషయాన్ని అమీర్ ఖాన్ అధికారికంగా ప్రకటించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రూ. 100 చెల్లించి ఈ సినిమాను చూడవచ్చని తెలిపారు. ఈ చిత్రం ఆమిర్ ఖాన్ అధికారిక యూట్యూబ్ ఛానల్.. ఆమిర్ ఖాన్ టాకీస్: జనతా కా థియేటర్‌లో రూ. 100కు అందుబాటులో ఉండనుంది.సునీల్ శెట్టి ప్రస్తుతం అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో స్ట్రీమ్ అవుతున్న 'హంటర్ 2'లో కనిపిస్తున్నారు. ఇందులో ఆయన కిడ్నాప్‌నకు గురైన తన కూతురిని రక్షించుకునే ఏసీపీ విక్రమ్‌సిన్హా పాత్రలో నటిస్తున్నారు.

# ఇంకా 29 రోజులే ఉన్నాయి.. భారీ అప్‌డేట్స్

రాబోతున్నాయంటూ అప్డేట్ ఇచ్చిన మేకర్స్
ఇంకా 29 రోజులే ఉన్నాయి.. భారీ అప్‌డేట్స్ రాబోతున్నాయంటూ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

మాస్ మహారాజా రవితేజ లేటెస్ట్ మాస్ ఎంటర్‌టైనింగ్ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరకు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో డ్యాన్సింగ్ డాల్ శ్రీలీల హీరోహీరోయిన్‌గా నటిస్తుండగా.. నవీన్ చంద్ర కీ రోల్ పోషిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమా ఆగస్టు 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. దీంతో షూటింగ్ పనుల్లో జోరు పెంచారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే తాజాగా సెట్స్ నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ''మాస్ జాతర' కోసం రవితేజ డబ్బింగ్ ప్రారంభమైంది.. కేవలం 29 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి.. ఆగస్టు 1వ వారం నుండి భారీ అప్‌డేట్‌లు లోడ్ అవుతున్నాయి' అంటూ రవితేజ డబ్బింగ్ చెప్తున్న ఫొటోను షేర్ చేశారు చిత్ర బృందం.







# చిలుకతో అక్కడ కరిపించుకున్న పవన్ కళ్యాణ్ హీరోయిన్.. వైరల్‌గా మారిన క్యూట్ వీడియో

యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ 'సవ్యసాచి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో హిట్ అందుకుని ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ సినిమాల్లో నటించింది. ఇక ఇటీవల ఈ అమ్మడు భారీ ప్రాజెక్ట్ 'హరి హర వీరమల్లు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇందులో అర్జున్ రాంపాల్, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించారు. భారీ అంచనాల మధ్య ఈ పీరియాడికల్ మూవీ జులై 24న థియేటర్స్‌లో విడుదలై మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

ఇదిలా ఉంటే.. తాజాగా, నిధి అగర్వాల్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో నిధి పాప ఓ సినిమా షూటింగ్‌లో చిలుకతో ఆడుకుంటోంది. దాన్ని చేతిపై నిల్చొబెట్టుకుని మాట్లాడుతూ కనిపించింది. అది పైకి ఎక్కుతూ చేతులను కరుస్తుండగా.. ఈ అమ్మడు చాలా భయపడిపోయింది. దీంతో పక్కనే ఉన్న వ్యక్తి దానిని తీసుకోవడం కాస్త రిలాక్స్ అయింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. అది చూసిన నెటిజన్లు క్యూట్ నిధి పాప అని కామెంట్లు చేస్తున్నారు. కాగా, నిధి సినిమాల విషయానికొస్తే.. 'ది రాజా సాబ్' హారర్ కామెడీ చిత్రంలో నటిస్తోంది. ఇందులో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తుండగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ మూవీ భారీ అంచనాల మధ్య డిసెంబర్ 5న థియేటర్స్‌లోకి రాబోతుంది.

# డైరెక్టర్‌కు ట్రాన్స్ లేటర్‌గా నిత్యామీనన్.. స్టేజీపై నవ్వులే నవ్వులు!

**కోలీవుడ్ హీరో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా నటిస్తోన్న తాజా చిత్రం 'సార్ మేడమ్'. రూరల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా వస్తోన్న ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో నిత్యామీనన్, విజయ్ సేతుపతి భార్య, భర్తలుగా నటించారు.**

ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 1న థియేటర్లలో సందడి చేయనుంది. దీంతో మూవీ ప్రమోషన్స్ జోరు పెంచారు మేకర్స్. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ సేతుపతితో పాటు నిత్యామీనన్, డైరెక్టర్ పాండిరాజ్ కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిత్యామీనన్ తెలుగు ట్రాన్స్‌లేట్ చేసి అభిమానులను ఆకట్టుకుంది. డైరెక్టర్ పాండిరాజ్ తమిళంలో మాట్లాడగా.. ఆ వ్యాఖ్యలను తెలుగులోకి ట్రాన్స్ లేట్ చేసింది. 'సార్ మేడమ్ సినిమా చాలా మంచి లవ్ స్టోరీ.. భార్య, భర్తల మధ్య జరిగే గొడవ.. కానీ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది.. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ చాలా బాగా నటించారు.. వీళ్ల కన్నా బెటర్‌గా ఎవరూ చేయలేరు.. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్' అంటూ డైరెక్టర్ పాండిరాజ్ మాటలకు ట్రాన్స్‌లేటర్‌గా నిత్యామీనన్ అందరికీ నవ్వులు తెప్పించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. ఈ సినిమాలో యోగి బాబు కీలక పాత్ర పోషించారు.

# నైసాని చూస్తుంటే గర్వంగా ఉంది: వీడియో షేర్ చేసిన కాజోల్



తన కుమార్తె నైసా ను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు అజయ్ దేవ్‌గణ్ , కాజోల్ . నైసా గ్రాడ్యుయేషన్ డే వేడుకకు హాజరైన వారు ఓ వీడియో షేర్ చేశారు. ''చాలా ప్రత్యేకమైన సందర్భం. గర్వంగా ఉంది. ఎమోషనల్'' అని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లోని విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్నేషనల్ హాస్పిటాలిటీలో బీబీఏ (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీ పట్టా పొందింది.

22 ఏళ్ల నైసా సినిమా ఇండస్ట్రీలోకి వచ్చే అవకాశాలున్నాయంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. కాజోల్ ఖండించారు. నైసా చదువులో చురుకు. ఆటలూ ఇష్టమే. ఖాళీ సమయంలో విహార యాత్రలకు వెళుతుంటుంది. ఆమెకు ఓ తమ్ముడు ఉన్నాడు. అజయ్ దేవ్‌గణ్ సినిమాల విషయానికొస్తే.. ఆయన హీరోగా నటించిన కామెడీ మూవీ 'సన్నాఫ్ సర్దార్ 2' ఆగస్టు 1 విడుదల కానుంది. కాజోల్ నటించిన లేటెస్ట్ మూవీ 'సర్‌జమీన్' ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

# శుభ్‌మన్ గిల్ మరోసారి తానేంటో నిరూపించుకున్నాడు: రవిచంద్రన్ అశ్విన్

**ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో టీమ్ఇండియాకు జరిగిన నాలుగో టెస్టులో రాణించిన గిల్.. మరోసారి తానేంటో నిరూపించుకున్నాడని అశ్విన్ అన్నాడు. గిల్ తన తప్పుల నుంచి నేర్చుకుంటాడని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. లార్డ్స్ టెస్ట్‌లో విఫలం కాగానే శుభ్‌మన్‌గిల్‌ను చాలామంది విమర్శించారు. అతడి బ్యాటింగ్ టెక్నిక్ మీద సందేహాలు వెలిబుచ్చారు. కానీ అతడు మాంచెస్టర్ టెస్ట్‌లో తన ఇన్నింగ్స్ ద్వారా వాటన్నింటినీ పటాపంచలు చేశాడని అశ్విన్ కొనియాడాడు.**



'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన సెంచరీ చేసి తానేంటో మరోసారి నిరూపించుకున్నాడు. అతడు తన టెక్నిక్ మీద కసరత్తు చేశాడు. కానీ అతడు కెప్టెన్‌గా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదు. వాషింగ్టన్ సుందర్‌ను ఆలస్యంగా తీసుకురావడం చాలా పెద్ద తప్పిదం. కానీ ఇలాంటివి జరుగుతుంటాయి. గిల్ ఇంకా యువకెప్టెనే కాబట్టి.. అతడు తన తప్పుల నుంచే నేర్చుకుంటాడు. అయితే అతడు చాలా త్వరగా నేర్చుకుంటాడని నేను ఆశిస్తున్నా' అని అశ్విన్ అన్నాడు.

బ్యాటింగ్‌లో గిల్ విజయాల గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గా అద్భుతంగా రాణిస్తున్నాడు. బర్మింగ్‌హామ్, హెడింగ్లీలో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. లార్డ్‌స్‌లో టీమ్ఇండియా టెస్ట్ మ్యాచ్ ఓడిపోగానే చాలామంది గిల్ బ్యాటింగ్‌ను ప్రశ్నించారు. కానీ అతడు తిరిగి పుంజుకున్నాడు' అని అశ్విన్ విశ్లేషించాడు.

అలాగే రవిచంద్రన్ అశ్విన్ టీమ్ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఓ సలహా ఇచ్చాడు. 'దయచేసి ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు బ్యాటింగ్ డెప్త్ ద్వారా గెలవలేం. డ్రా మాత్రం చేసుకోవచ్చు. వికెట్లు తీయగల నేర్పున్న బౌలర్లు టీమ్‌లో ఉంటేనే టెస్ట్ మ్యాచ్‌లను గెలవగలం' అని రవిచంద్రన్ అశ్విన్ కుండబద్దలు కొట్టాడు.



## టాప్ టెన్‌లోకి సాత్విక్ చిరాగ్ జోడీ రీఎంట్రీ!

బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి తిరిగి టాప్ టెన్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఏసియన్ గేమ్స్ ఛాంపియన్స్ అయిన ఈ జోడీ.. ఇటీవల జరిగిన చైనా ఓపెన్ సెమీస్‌లో నిష్క్రమించింది. తాజా ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు మెరుగు పరచుకొని పదో స్థానానికి చేరింది. పురుషుల సింగిల్స్‌లో భారత టాప్ స్టార్ లక్ష్య సేన్.. 54,442 పాయింట్లతో 17వ ర్యాంకుకు చేరుకున్నాడు. హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా రెండు స్థానాలు మెరుగై 40,336 పాయింట్లతో 33వ ర్యాంకుకు చేరాడు. మహిళల సింగిల్స్‌లో 17 ఏళ్ల ఉన్నతి హుడా నాలుగు స్థానాలు మెరుగై తన కెరీర్ బెస్ట్ 31వ ర్యాంకుకు చేరుకుంది. స్టార్ షట్లర్ పీవీ సింధు 15వ ర్యాంకులో కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీగాయత్రి గోపీచంద్ జోడీ 11వ ర్యాంకులో ఉండగా.. తనీషా క్రాస్టోఅశ్వినీ పొన్నప్ప జోడీ రెండు స్థానాలు మెరుగై 45వ ర్యాంకుకు చేరుకుంది.



## బీసీసీఐ కార్యాలయంలో చోరీ

ముంబైలోని వాంఖడే స్టేడియంలోని బీసీసీఐ కార్యాలయంలో చోరీ జరిగింది. కార్యాలయంలోని మెర్చండైజ్ స్టోర్ నుంచి ఐపీఎల్ 2025కి సంబంధించిన 261 జెర్సీలు దొంగలించబడ్డాయి. ఒక్కో జెర్సీకి దాదాపు రూ.2,500 ధర ఉంటుందని, మొత్తం వీటి విలువ దాదాపు రూ.6.5 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. ఈ ఘటన జూన్ 13న జరిగినప్పటికీ.. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీసీసీఐ కార్యాలయంలో స్టాక్ ఆడిట్ నిర్వహించినప్పుడు పలు వస్తువులు కనిపించడం లేదని గుర్తించారు. వెంటనే బీసీసీఐ అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. సెక్యూరిటీ గార్డు ఫారూక్ అస్లామ్ ఖాన్ ఒక భారీ కార్డ్‌బోర్డ్ పెట్టెను లాక్కెళ్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డు అయ్యాయి. దీంతో జూన్ 17న మెరైన్ డ్రైవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారించగా.. జెర్సీలను విక్రయించి, ఆ డబ్బుతో ఆన్‌లైన్ జూదం ఆడినట్లుగా అంగీకరించాడు. అతడి వద్ద నుంచి ఇప్పటివరకు పోలీసులు కేవలం 50 జెర్సీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ జెర్సీలు ఆటగాళ్ల కోసం ఉంచినవా లేదా అభిమానుల కోసం సిద్ధం చేసినవా అన్నది ఇంకా స్పష్టత లేదు. ఇక సెక్యూరిటీ గార్డు చెప్పిన విషయాలను ధ్రువీకరించడానికి పోలీసులు ప్రస్తుతం అతని బ్యాంక్ ఖాతా వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



## నెంబర్ 1 ర్యాంకు కోల్పోయిన మంధాన!

ఆరేళ్ల తర్వాత మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించిన టీమిండియా బ్యాటర్ స్మృతి మంధాన.. ఎక్కువ రోజులు ఆ స్థానంలో కొనసాగలేకపోయింది. తాజాగా విడుదలైన ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయింది. ఇటీవల భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డే సిరీసులో అద్భుతంగా రాణించిన ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్.. టాప్ ర్యాంకుకు చేరుకుంది. ఈ సిరీసులో మూడు మ్యాచుల్లో మంధాన 115 పరుగులు చేయగా.. సివర్ 160 రన్స్ చేసింది. 2023 తర్వాత నాట్ సివర్ ఇలా వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించడం ఇదే తొలిసారి. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా పది స్థానాలు ఎగబాకి పదో ర్యాంకుకు చేరుకుంది. జెమీమా రోడ్రిగెజ్ కూడా రెండు స్థానాలు మెరుగై 13వ స్థానానికి చేరింది. బౌలర్లలో దీప్తి శర్మ నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



# చివరి టెస్టులో బుమ్రా ఆడతాడా?.. ప్రస్తుతం ఫిట్‌గానే ఉన్నాడంటున్న కోచ్!

ఇంగ్లండ్‌తో చివరి టెస్టుకు సిద్ధం అవుతున్న టీమిండియా.. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా విషయంలో ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఈ విషయంపై భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ మాట్లాడుతూ బుమ్రా ఫిట్‌గానే ఉన్నాడని చెప్పాడు. అయితే బుమ్రా ఐదో టెస్టు ఆడటం గురించి ఇంకా ఎలాంటి చర్చలు జరగలేదన్నాడు.

'ప్రస్తుతానికి బుమ్రా ఫిట్‌గానే ఉన్నాడు. వర్క్‌లోడ్ ప్రకారం చూసుకున్నా.. నాలుగో టెస్టులో తను ఒక ఇన్నింగ్స్‌లోనే మాత్రమే బౌలింగ్ చేశాడు. కాబట్టి మా ఫిజియో, కెప్టెన్, హెడ్ కోచ్ కలిసి చర్చించి ఒక డెసిషన్ తీసుకుంటారు' అని కోటక్ వివరించాడు.

ఈ సిరీసులో భారత్ తరఫున బెస్ట్ బౌలర్ బుమ్రానే. మూడు టెస్టుల్లో 3.04 ఎకానమీ, 26 సగటుతో 14 వికెట్లు తీసుకున్నాడు. ఇంగ్లండ్ పర్యటన ప్రారంభానికి ముందే బుమ్రాతో వరుసగా టెస్టు మ్యాచులు ఆడించకూడదని అనుకుంటున్నామని, కాబట్టి అతను మూడు టెస్టులే ఆడతాడని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ చెప్పాడు.

కానీ లార్డ్‌స్‌లో ఓడిపోవడంతో మాంచెస్టర్ మ్యాచ్‌లో తప్పనిసరిగా బుమ్రాను ఆడించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 21తో ఆధిక్యంలో ఉన్న నేపథ్యంలో.. సిరీస్ డ్రా చేసుకోవాలన్నా సరే చివరి టెస్టులో టీమిండియా గెలవాల్సిందే.

# ఆసియా కప్‌లో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదు!

ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న గ్రూప్ దశలో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది. అయితే ఈ షెడ్యూలు విడుదలైన తర్వాత నుంచి సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో టీమ్ఇండియా.. ఆ దేశంతో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదంటూ పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. అయితే ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఆసియా కప్‌లో మొత్తంగా టీమ్ఇండియా గరిష్ఠంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడే అవకాశం ఉంది.

'ఇది ద్వైపాక్షిక పోటీ కాదు. బహుళ దేశాలు పాల్గొనే టోర్నమెంట్లో జరిగే మ్యాచ్. పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడకుంటే.. దాయాది జట్టుకు భారీ ప్రయోజనం కలుగుతుంది. కాబట్టి అది సరికాదు' అని అధికారిక వర్గాలు అంటున్నాయి. అలాగే ఈవిషయమై క్రీడా మంత్రిత్వశాఖ అధికారులు కూడా మాట్లాడారు. 'ప్రస్తుతానికి, జాతీయ క్రీడా పాలన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. కాబట్టి.. బీసీసీఐ క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదు. అయితే బీసీసీఐ ప్రజల మనోభావాల మీద ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం' అని వారు అన్నారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు మాత్రం తావులేదని క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది.




డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) కేజీఎస్ ధిల్లాన్, పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చిన ప్రముఖులలో ఒకరు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, క్రీడలు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, ఎనిమిది దేశాల జట్లు పాల్గొనే ఆసియా కప్ ఐసీసీ ఈవెంట్ కాదు. అలాగే.. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోహ్సిన్ నఖ్వీనే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు.

2008 ముంబయి ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ హస్తం ఉన్న నేపథ్యంలో.. అప్పటినుంచి భారత్ ఆ దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో పాల్గొనడం లేదు. కానీ వరల్డ్‌కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ ఈవెంట్లలో ఇరు దేశాల జట్లు తటస్థ వేదికల మీదే తలపడుతున్నాయి.